సాక్షి
కుమురం భీం
గురువారం ׀ 9 ׀ అక్టోబర్ ׀ 2025



అ'విశ్రాంత' స్విమ్మర్లు!

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో అన్ని కాలాల్లో సమృద్ధిగా నీరు ఉంటుంది. 70 ఏళ్లకు చేరువగా ఉన్న వారు హుషారుగా ఇక్కడ ఈత కొడుతున్నారు. 8లో▸



అధ్వానంగా రోడ్లు..!

దహెగాం మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. వాహనదారులు ఆయా రోడ్లపై రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.6 /22.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉక్కబోత ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

నామినేషన్లకు వేళాయె..!

- పరిషత్ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
- రెండు విడతల్లో పోలింగ్
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ

ఆసిఫాబాద్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. తొలివిడత ఎన్నికల్లో భాగంగా నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై వచ్చిన పిటిషన్లను హైకోర్టు బుధవారం విచారించడంతో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విచారణను గురువారానికి వాయిదా వేసినా.. నోటిఫికేషన్ విడుదలకు హైకోర్టు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. దీంతో నామినేషన్ల ప్రక్రియ యథాతథంగా ముందుకు సాగనుంది. జిల్లాలోని 345 పోలింగ్ కేంద్రాల పరిధిలో 127 ఎంపీటీసీ, 15 జెడ్పీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. 335 గ్రామ పంచాయతీల పరిధిలో 3,53,895 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు ఉన్నారు.

రెండు విడతల్లో ఎన్నికలు

ఈ నెల 23న తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, 27న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి దశలో బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, కాగజ్‌నగర్, రెబ్బెన, కౌటాల, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) మండలాల్లోని ఎనిమిది జెడ్పీటీసీ స్థానాలు, 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ), కెరమెరి మండలాల్లోని ఏడు జెడ్పీటీసీ స్థానాలు, 56 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల స్వీకరణకు ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు వేర్వేరుగా నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలివిడత జెడ్పీటీసీ నామినేషన్లకు 8 మంది రిటర్నింగ్ అధికారులు, ఎంపీటీసీ నామినేషన్లకు 40 మంది రిటర్నింగ్ అధికారులను నియమించారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. హైకోర్టు గురువారం తీర్పునిచ్చే అవకాశం ఉండటంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థుల వేటలో నిమగ్నమయ్యాయి. క్షేత్రస్థాయిలో మంతనాలు జరపగా, త్వరలో జాబితాను ఫైనల్ చేయనున్నాయి. కాగా, 2016లో కుమురంభీం ఆసిఫాబాద్ కొత్త జిల్లాగా ఏర్పడగా తొలిసారి జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం ఎస్టీలకు కేటాయించారు. తాజా రిజర్వేషన్లతో బీసీ జనరల్‌కు కేటాయించడంతో వెనుకబడిన వర్గాలకు దక్కే అవకాశం ఉంది. కొత్త రిజర్వేషన్లు అమలవుతాయా.. లేక పాతవే కొనసాగుతాయనే సందిగ్ధత కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణకు హైకోర్టు తీర్పు కీలకం కానుంది.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు, అధికారులు

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

ఆసిఫాబాద్: సాధారణ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 9న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు, జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణకు బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, ఇతర అంశాలకు సంబంధించి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పాటించాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత 8 జెడ్పీటీసీలు, 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఇప్పటికే సహాయ ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్

ముఖ్య ఘట్టాలు	తొలి విడత	రెండో విడత
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 09	అక్టోబర్ 13
చివరి తేదీలు	అక్టోబర్ 11	అక్టోబర్ 15
పరిశీలన	అక్టోబర్ 12	అక్టోబర్ 16
ఉపసంహరణ	అక్టోబర్ 15	అక్టోబర్ 19
ఎన్నికల తేదీలు	అక్టోబర్ 23	అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు	నవంబర్ 11	నవంబర్ 11



ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన


పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కేంద్రాలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. కౌంటింగ్ చేపట్టే గదులు, స్ట్రాంగ్ రూం, పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ గదుల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మధుకర్, డీఎస్పీ వహీదుద్దీన్, అధికారులు ఉన్నారు.

'భూభారతి' దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి బుధవారం డివిజన్‌లోని తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టా పాసుపుస్తకాల్లోని పేరు, తండ్రి పేరు, ఇంటి పేరు, విస్తీర్ణం, విరాసత్ పట్టా మార్పిడి, డిజిటల్ సంతకం కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు.

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ


వంటలు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్: వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలను బుధవారం సందర్శించారు. వంటలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు స్టాఫ్ రూంలో కాలక్షేపం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. మండలంలోని చిర్రకుంట, రింగన్‌గూడ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం సందర్శించారు. వంట, తరగతి గదులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన బోధన చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఫౌండేషన్, లిటరసీ అండ్ న్యూమరసీ లో విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానంపై అందిస్తున్న శిక్షణ వివరాలు అడి గి తెలుసుకున్నారు. ఏఐ బోధనను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అకాడమిక్ మా నిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం 27వ రోజుకు చేరగా, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్మికులు కృష్ణమాచారి, ప్రభాకర్, వసంత్‌రావు, కోటయ్య, భరత్, శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, తిరుపతి, దివ్య, మాన్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

మెనూపై పట్టింపేది..?


బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

చింతలమానెపల్లి: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేలా రూపొందించిన మెనూ అమలు కావడం లేదు. చింతలమానెపల్లి మండలం బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉదయం అల్పాహారంలో పులిహోరకు బదులుగా కిచిడీ అందించారు. మధ్యాహ్నం వెజ్ బిర్యాణి, ఆలు కుర్మ, పెరుగు, కోడి గుడ్డుకూర, స్నాక్స్‌లో అరటిపండు లేదా బొప్పాయి పండు అందించాలి. కానీ మధ్యాహ్నం భోజనంలో వంకాయ ఆలుగడ్డ కూర, పప్పుతో సరిపెట్టారు. దసరా సెలవుల తర్వాత మెనూ పాటించడం లేదని, కోడిగుడ్లు, చికెన్‌తో ఇప్పటి వరకు భోజనం అందించలేదని విద్యార్థినులు తెలిపారు. పాలు, పెరుగుతోపాటు వస్తువులు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదని, అందుకే మెనూ అమలు చేయడం లేదని ప్రధానోపాధ్యాయుడు గోపి తెలిపారు. శుక్రవారం నుంచి మెనూ అమలు చేస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీకి పండుగ


మంచిర్యాల బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- కలిసొచ్చిన బతుకమ్మ, దసరా
- ఉమ్మడి జిల్లా నుంచి 998 ప్రత్యేక సర్వీసులు
- అదనపు ఆదాయం రూ.3 కోట్లపైనే..

మంచిర్యాలఅర్బన్: బతుకమ్మ, దసరా పండుగలతో ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరి పండుగ చేసుకుంది. దసరా ముందు, తర్వాత ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రత్యేక బస్సులు నడిపించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి జిల్లా నుంచి రాజధానికి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. ఉద్యోగం, చదువు రీత్యా హైదరాబాద్‌కు వెళ్లిన వారు సొంతూళ్లకు వచ్చి వెళ్లడానికి బస్సుల రాకపోకలకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది దసరా సందర్భంగా రోజువారీ బస్సులతోపాటు అదనపు బస్సులు తిప్పడం ద్వారా ప్రయాణికులకు ఇబ్బందులు తొలగడంతోపాటు సంస్థకు ఖజానా సమకూరింది. ఉమ్మడి జిల్లా నుంచి ఆయా డిపోల ద్వారా హైదరాబాద్‌కు దసరా ముందు, తర్వాత సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 6వరకు 998 అదనపు బస్సులు ఏర్పాటు చేసింది. 5,10,072 కిలోమీటర్లు నడపడం ద్వారా 1,39,388 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. దీంతో రూ.3,01,08,462 ఆదాయం సమకూరింది.

దసరా ముందు.. తర్వాత

దసరా పండుగకు ముందు ఉమ్మడి జిల్లా(రీజియన్) నుంచి ఆదిలాబాద్, భైంసా, నిర్మల్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి 399 ప్రత్యేక బస్సులు నడిపించారు. ఏడు సూపర్ లగ్జరీ(మంచిర్యాల డిపో)లు, 43 సూపర్‌లగ్జరీలు, 23 డీలక్స్, 241 ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక బస్సులు నడిపారు. 2,05,348 కిలోమీటర్ల మేర బస్సులు నడపడం ద్వారా 56,467 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. రూ.1,16,02,891 ఆదాయం చేకూరింది. పండుగ తర్వాత ఈ నెల 3నుంచి 6వరకు రీజియన్ వారీగా 599 బస్సులు నడిపారు. ఇందులో 15రాజధాని, 192 సూపర్‌లగ్జరీ, 38 డీలక్స్, 354 ఎక్స్‌ప్రెస్ బస్సులు తిప్పారు. అదనపు బస్సులతో 3,04,724 కిలోమీటర్లు నడిపి 82,921 మంది గమ్యస్థానాలకు చేర్చారు. రూ.1,85,05,571 ఆదాయం వచ్చింది.

అధికంగా మంచిర్యాల డిపో నుంచే..

పండుగ నేపథ్యంలో ఆయా డిపోల నుంచి మొత్తంగా 998 బస్సులు నడిపించగా.. ఇందులో అధికంగా మంచిర్యాల డిపో నుంచే 198 బస్సులు ఉన్నాయి. 11,701 మంది మహాలక్ష్మి పథకం ప్రయాణికులు కాగా, 11954మంది టికెట్లు కొనుగోలు చేశారు. 98,867 కిలోమీటర్లు మేర బస్సులు తిప్పి 23,655 మంది ప్రయాణికులను చేరవేయడం ద్వారా రూ.62,70,066 ఆదాయం వచ్చింది. దసరా ముందు సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ ఒకటి వరకు 120 బస్సులు 59536 కిలోమీటర్లు నడపడం ద్వారా 14,575 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇందులో మహాలక్ష్మి పథకం 8192 మంది, 6,950 మంది టికెట్లు కొనుగోలు చేసి ప్రయాణం చేశారు. రూ.35,92,471 సమకూరింది. దసరా తర్వాత ఈ నెల 3 నుంచి 6వరకు 8,513 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసి రూ.26,77,595 ఆర్జించింది. దసరా ముందు, తర్వాత వచ్చిన ఆదాయంలో ఆదిలాబాద్ రీజియన్ వారీగా పరిశీలిస్తే మంచిర్యాల డిపో ముందుంది.

రీజియన్ వారీగా దసరాకు ముందు ప్రత్యేక బస్సులు ఇలా..

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ప్రయాణికులు	ఆదాయం(రూ.లలో)
ఆదిలాబాద్	94	55,178	13,349	25,88,870
భైంసా	30	14,214	8,391	7,32,587
నిర్మల్	117	52,348	12,463	31,82,235
ఉట్నూర్	09	5,598	2,492	3,53,871
ఆసిఫాబాద్	29	18,474	5,197	11,52,857
మంచిర్యాల	120	59,536	14,575	35,92,471

దసరా తర్వాత అక్టోబర్ 3నుంచి 6వరకు..

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ప్రయాణికులు	ఆదాయం(రూ.లలో)
ఆదిలాబాద్	118	66907	15,785	32,70,780
భైంసా	37	18202	10,060	9,37,099
నిర్మల్	180	79,264	19,193	54,02,289
ఉట్నూర్	15	9352	3,593	5,63,701
ఆసిఫాబాద్	51	32,132	10,635	20,61,636
మంచిర్యాల	198	98867	23,655	62,70,066

గోదాముల్లోనే చీరలు!

- స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌తో నిలిచిన పంపిణీ
- జిల్లాలో 1,02,992 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు

బెజ్జూర్(సిర్పూర్): బతుకమ్మ చీరల పంపిణీకి అవంతరాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చేరిన చీరలు గోదాములకే పరిమితం కానున్నాయి. 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరుతో ప్రభుత్వం మహిళా సంఘాల్లోని ప్రతీ సభ్యురాలికి ఉచితంగా రెండు చీరలు అందించాలని నిర్ణయించింది. జిల్లాలోని 1,02,992 మంది సభ్యులు ఉ న్నట్లు గుర్తించారు. ఇప్పటికే వారి వివరాలను సంబంధిత అధికారులు సేకరించారు. బతుకమ్మ పండుగ సమయంలోనే చీరలు జిల్లాకు చీరలు చేరుకున్నాయి. మండలాలకు సరఫరా చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతుండగా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ నిలిచిపోయింది.

తొలివిడతలో 30వేలు..

గత ప్రభుత్వం రేషన్ కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. అయితే నాణ్యత విషయంలో విమర్శలు రావడంతో గతేడాది నిలిపివేసింది. మళ్లీ ఈ ఏడాది నుంచి కొనసాగించాలని నిర్ణయించి చీరలు జిల్లాలకు సరఫరా చేశారు. ఒక్కొక్క చీరకు సుమారు రూ.800 వరకు వెచ్చించినట్లు అధికారులు చెబుతున్నారు. మొదటి విడతలో జిల్లాకు 1,02,992 చీరలు రావాల్సి ఉండగా, ముందుగా 30వేల వరకు చేరుకున్నాయి. వీటిని భద్రపర్చే బాధ్యతను గ్రామీణాభివృద్ధి సంస్థకు అప్పగించారు. కౌటాలలోని గోదాంలో 71,001, రాంపూర్‌లో 19,680, జైనూర్‌లోని గోదాంలో 3,983 చీరలను భద్రపరిచారు. జిల్లాలో 8,897 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,02,992 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. సంఘాల్లో ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారికే చేరే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులకు నివేదిక..

జిల్లాలో సంఘాలు, వాటిలో సభ్యుల సంఖ్య, ఏయే ప్రాంతాలకు చీరలు సరఫరా చేయాలనే వివరాలను మెప్మా, సెర్ప్ సిబ్బంది సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించారు. రాంపూర్‌లోని గోదాం నుంచి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి, దహెగాం, రెబ్బెన, తిర్యాణి, కౌటాల గోదాం నుంచి కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, జైనూర్ గోదాం నుంచి జైనూర్, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు చీరలు చేరవేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం బతుకమ్మ సమయంలోనే చీరలు అందిస్తుందని మహిళలు ఎదురుచూశారు. కోడ్ కారణంగా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు చీరలు గోదాముల్లోనే ఉండనున్నాయి.

కోడ్‌తో పంపిణీ నిలిపివేత

స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు 30వేల చీరలు దసరా పండగకు ముందే గోదాములకు చేరాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిపివేశాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– యాదగిరి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యు.స్రవంతి అన్నారు. 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన విత్తనాలతో సాగు చేసిన పంటలను బుధవారం సందర్శించారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన కంది, పెసర విత్తనాలను రైతులకు అందించినట్లు తెలిపారు. వాంకిడికి చెందిన బండె నాందేవు సాగు చేసిన కంది పంటను పరిశీలించి సూచనలు చేశారు. విత్తనోత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పులు, పంటల స్వభావం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో ప్రతీ గ్రామం విత్తన స్వయం సంవృద్ధి సాధించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రసూన, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణ, ఏఈవోలు రాజేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మహేశ్వర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి నిఖిలేష్ రాష్ట్రస్థా యి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. పాఠశాల ఆవరణలో బుధవారం పీడీ తిరుపతితో కలిసి విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల మంచిర్యాలలో జరిగిన అండర్- 19 జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో నిఖిలేష్ ఉత్తమ ప్రతిభ చూపాడని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

వైభవంగా 'బులాయి'


ఐనంలో బులాయి ఆడుతున్న మహిళలు

దహెగాం మండలంలోని ఐనం, రాళ్లగూడ గ్రామాల్లో బుధవారం రాత్రి బులాయి పండుగను వైభవంగా జరుపుకొన్నారు. ముందుగా గ్రామాల్లో బోందోబా విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, మహిళలతో ఐనంలో సందడి నెలకొంది. పండుగ కోసం ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. వేడుకలు తిలకించేందుకు కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, కన్నెపల్లి మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

గ్రామంలోని దుకాణాల వద్ద సందడి


– దహెగాం

క్లుప్తంగా

అత్యాచార కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అత్యాచార కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2023 నవంబర్ 8న బేల మండలంలోని ఓ గ్రామానికి చెందిన నిందితుడు గుర్నాలే నగేశ్ తన వ్యవసాయ చేనులో పత్తి తీసేందుకు వచ్చిన ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో సదరు మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాధిక కేసు నమోదు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని హాజరుపర్చి పది మంది సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ రహీమ్ నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు. నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అటవీశాఖ అధికారులు

సిరికొండ: మండల కేంద్రంలో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పలు ఇళ్లలో సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.32 వేల విలువ గల కలప పట్టుకున్నట్లు సిరికొండ అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ చంద్రారెడ్డి తెలిపారు. పట్టుకున్న కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించామని పేర్కొన్నారు. కలప, ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుకున్న కలపపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన సంకెర్ల ప్రవీణ్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీపై బుధవారం కేసు నమోదైంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ ఆగస్టు 31న రవీంద్రనగర్‌లో గల తన యజమాని ఇంటి వద్ద పూజా కార్యక్రమం ఉండడంతో ద్విచక్ర వాహనం ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. గంట తర్వాత వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రవీణ్ బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్'పై వెబినార్

బాసర: ఆర్జీయూకేటీలో ఇన్ఫర్మేషన్ లైబ్రరీ నెట్వర్క్ సెంటర్, ఢిల్లీ ఆధ్వర్యంలో 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' అనే అంశంపై బుధవారం వెబినార్ నిర్వహించారు. కార్యక్రమానికి సౌత్ ఏషియా ఐ గ్రూప్ ఆఫ్ ఇండియా సంచాలకులు ట్రీస్టన్ బార్డర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇన్ఫర్మేషన్ లైబ్రరీ నెట్వర్క్ సెంటర్ సంచాలకులు ప్రొఫెసర్ దేవిక మాట్లాడుతూ భారత ప్రభుత్వం జనహితం కోసం వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆర్జీయూకేటీ గ్రంథాలయ అధికారిణి డాక్టర్ అరుణజ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్ అర్చన, డీపీవో శైలజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవిశ్రాంత స్విమ్మర్లు!

వారంతా ఏడు పదుల వయసుకు కాస్త అటుఇటుగా ఉన్న వారే. సాధారణంగా ఇలాంటి వారికి ఆరోగ్యం కోసం ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నడక మంచిదని వైద్యులు సూచిస్తుంటారు. కానీ ఈ సీనియర్ సిటిజన్లు మాత్రం ఉదయం తెల్లవారుజామునే ప్రకృతి సిద్ధమైన చెరువులో ఈత కొడుతూ హుషారైన జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువు విస్తీర్ణంలోనూ అత్యంత విశాలమైనది. అన్ని కాలాల్లో సమృద్ధిగా నీరు ఉంటుంది. ఇక్కడ ఉదయం వేళ 70 ఏళ్లకు చేరువగా ఉన్న వారు హుషారుగా ఈత కొడుతున్న దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి.

– నిర్మల్‌ఖిల్లా

- ప్రత్యేకత చాటుతున్న సీనియర్ సిటిజన్లు
- ఏడు పదుల వయసులోనూ ఈత
- రోజూ ఉదయం గొలుసుకట్టు చెరువులో సరదాగా..
- ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం వారి సొంతం



స్విమ్మింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు



సాధారణంగా 50 వయసు దాటిందంటేనే బీపీ, షుగర్ వంటి కాలానుక్రమ వ్యాధులు వచ్చేసి ఓ చిన్నపాటి నిరుత్సాహం ఆవహిస్తుంది. కానీ బంగల్‌పేట్ చెరువులో దాదాపు 15 నుంచి 20 మంది సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఉల్లాసంగా, ఉత్సాహంగా, హుషారుగా చెరువంతా కలియదిరుగుతూ కిలోమీటర్ల మేర పరిధిలో ఈత కొడుతూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. చెరువు ఆవల ఒడ్డుకు అటు నుంచి ఇవతలి ఒడ్డుకు అవలీలగా చేరుకుంటున్నారు. ఈత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపు ద్వారా ప్రతీరోజు వీరంతా నిర్ణీత సమయానికి బంగల్‌పేట్ చెరువుకు చేరుకుని స్విమ్మింగ్ ఆస్వాదిస్తున్నారు. పట్టణంలోని రాజేందర్, మల్లేశ్, సాయిసూర్య, శంకర్, నర్సయ్య, శ్రీనివాస్, కిషన్, సుధాకర్, శ్రీనివాసాచారి, లింగం, నారాయణ తదితరులు స్విమ్మింగ్‌పై ఇప్పటి యువతకు అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఆసనాలు, సూర్య నమస్కారాలు చేస్తూ ఆరోగ్యంపై చైతన్యం పెంపొందిస్తున్నారు. ఈతతో శారీరకంగా, మానసికంగానూ బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతీరోజు ఈత తమ దినచర్యలో భాగమైపోయిందని వీరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్విమ్మింగ్‌తో ఆరోగ్యం



గతంలో అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యే నాకు కొంత కాలం క్రితం మెడ, వెన్నుపూసను కలిపే సర్వైకల్ భాగంలో మేజర్ సర్జరీ జరిగింది. స్వతహాగా ఈత అంటేనే అమితమైన అభిరుచి కలిగిన నేను ప్రతీరోజు ఉదయం 5 గంటలకు బంగల్‌పేట చెరువుకు చేరుకొని స్విమ్మింగ్ చేస్తాను. ఆపరేషన్ అనంతరం స్వల్పకాలంలోనే పూర్తిగా కోలుకున్నాను. విశాలమైన ప్రకృతిసిద్ధ చెరువులో వందల మీటర్ల పరిధిలో ఈత కొట్టడం ద్వారా శరీరం తేలికగా మారుతుంది.– డీవీ.రమణ, రిటైర్డ్ సూపరింటెండెంట్, నిర్మల్

యువత ఈత నేర్చుకోవాలి



ప్రస్తుతం చాలామంది యువతీ, యువకులకు స్విమ్మింగ్‌పై సరైన అవగాహన లేదు. వారంతా ఈత నేర్చుకొని ఉండడం అవసరం. స్విమ్మింగ్ ద్వారా అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ఈత నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలి. స్థానిక బంగల్‌పేట్ చెరువులో స్విమ్మింగ్ చేసే సీనియర్ సిటిజన్లు ఈతకోసం చెరువులో దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయాలి.

– తోట నర్సయ్య, నిర్మల్

చెరువులను పరిరక్షించాలి



గత కొన్ని దశాబ్దాలుగా బంగల్‌పేట్ చెరువులో స్విమ్మింగ్ చేస్తున్నాం. ఉదయం పూట గంటపాటు శ్రమించడం వల్ల శరీరం తేలికగా మారుతుంది. రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. ప్రస్తుతం చెరువు పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ వేయడం, వాటిని కాల్చడం వల్ల వచ్చే పొగతో చెరువు కాలుష్యంగా మారుతుంది. మున్సిపల్ అధికారులు సత్వరమే చెరువు పరిరక్షణ కోసం తగిన చర్యలు చేపట్టాలి. గొలుసుకట్టు చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా కట్టుదిట్టం చేయాలి.

– అర్కారి రాజేందర్, గాంధీనగర్, నిర్మల్

ప్రకృతి ఒడిలో సేద తీరినట్టు



పట్టణంలోని పెద్ద చెరువుల్లో బంగల్‌పేట్ చెరువు ఒకటి. ఇందులో ఉదయం పూట రెండు గంటల పాటు స్విమ్మింగ్ చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. మా మిత్రుల బృందం అంతా కలిసి ఉదయం వేళ ఈత కొడుతున్నాం. చుట్టూ కొండకోనలతో ఉన్న ఈ చెరువులో ఈతకొట్టడం ప్రకృతి ఒడిలో సేదతీరినట్టుగా మాకు అనిపిస్తుంది.

– నారాయణ, నిర్మల్

దినచర్యలో భాగం కావాలి



వయసుతో నిమిత్తం లేకుండా అందరూ స్విమ్మింగ్‌ను దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలి. తద్వారా మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు తగ్గుతాయి. శరీరంలోని అనవసర క్యాలరీలు కూడా తగ్గి రోజంతా తేలికగా ఉంటుంది. నరాల సంబంధిత వ్యాధులు దరిచేరవు. శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయి. మంచి ఫిట్‌నెస్ సాధించగలుగుతాం. నిర్మల్‌లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న బంగల్‌పేట్ చెరువు, ఖజానా చెరువు ఈతకు అనుకూలంగా ఉన్నాయి.– డాక్టర్ లక్ష్మీనరసింహ రెడ్డి, స్విమ్మర్, న్యూరో ఫిజీషియన్, నిర్మల్

ఆటలో మేటి.. రాజలింగు

- 75 ఏళ్ల వయస్సులో అంతర్జాతీయ పోటీల్లో రాణింపు
- నేటికీ రెండు పూటలా షటిల్ బ్యాడ్మింటన్ సాధన



రాజలింగును అభినందిస్తున్న ఏరియా జీఎం రాధాకృష్ణ

మందమర్రిరూరల్: కృషి, పట్టుదల ఉంటే వయస్సుతో సంబంధం లేకుండా ఇష్టమైన ఆటలో రాణించొచ్చని నిరూపిస్తున్నారు మందమర్రికి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాడు పల్లెం రాజలింగు. సింగరేణి ఉద్యోగంలో ఉన్నప్పుడు 15సార్లు కోలిండియాలో సింగరేణికి పతకాల వర్షం కురిపించిన ఆయన ఉద్యోగ విరమణ పొంది 17 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ 75 ఏళ్ల వయస్సులోనూ జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రస్థానం..

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన పల్లెం రాజలింగు సింగరేణి ఉద్యోగిగా 15సార్లు కోలిండియా స్థాయి పోటీల్లో పాల్గొని ఆరుసార్లు సింగిల్స్, డబుల్స్ విభాగం పోటీల్లో విన్నర్‌గా నిలిచాడు. 2008లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన ఆటకు మాత్రం విరమణ ఇవ్వలేదు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ ప్రత్యేకంగా రాజలింగును అభినందించారు. ఇండియా తరపున స్వీడన్, పోలాండ్, థాయిలాండ్‌లలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీలకు కూడా ఎంపికయ్యాడు. సెప్టెంబర్‌లో థాయిలాండ్‌లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అంతర్జాతీయ స్థాయి (అండర్–75) సింగిల్స్, డబుల్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. కాగా విశేషంగా రాణిస్తున్న తనకు సింగరేణి యాజమాన్యం కోచ్‌గా అవకాశం ఇవ్వాలని రాజలింగు కోరుతున్నాడు.

అలుగు విక్రయించేందుకు యత్నం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎఫ్‌వో రేవంత్ చంద్ర

- ముగ్గురు నిందితుల అరెస్ట్, ఇద్దరు పరారీ
- ఇన్‌చార్జి డీఎఫ్‌వో రేవంత్ చంద్ర

ఆదిలాబాద్‌టౌన్: అడవిలో అరుదుగా కనిపించే అలుగును అక్రమంగా విక్రయించేందుకు యత్నించిన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి, ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అటవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండలం అర్జుని గ్రామ పరిధిలోని పంట పొలంలో గల వలలో అరుదైన అలుగు చిక్కుకుంది. గమనించిన కొందరు వ్యక్తులు దాన్ని విక్రయించేందుకు యత్నించారు. దీనిపై సమాచారం అందడంతో అటవీ శాఖ సిబ్బంది మంగళవారం అక్కడికి చేరుకుని కినక శంకర్, పెందూర్ జుగ్నాథ్, పెందూర్ మహేశ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి అలుగును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆదిలాబాద్ ఎఫ్ఆర్‌వోలు గులాబ్ సింగ్, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌వో జి.శ్రీనివాస్, యాంటీ కోచింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో ముఖ్తార్ అహ్మద్, ఎఫ్ఎస్‌వో గోపాల్, సిబ్బంది సుభాష్, సజన్, రాజేందర్, విజయ్ పాల్గొన్నారు.

దాడి కేసులో యువకుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్

జైపూర్: దాడి కేసులో మండలంలోని కుందారం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీధర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కుందారం గ్రామానికి చెందిన దాసరి నరేశ్, మారెం అజయ్, బోగే ప్రశాంత్‌లు చెడు వ్యసనాలకు బానిసై గ్రామంలో అల్లర్లు సృష్టిస్తున్నారు. గత నెలలో జక్కం అంజన్నకు చెందిన ఆటోను ఇంటి నుంచి దొంగిలించారు. ఆటో అదుపుతప్పి బోల్తాపడగా మళ్లీ తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టి పారిపోయారు. ఇదే విషయాన్ని అంజన్న ప్రశ్నించగా ఆయనపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెల 4న అర్ధరాత్రి అంజన్న ఇంటికి వచ్చి మూడు సీసీ కెమెరాలను పగులగొట్టి అతడిపై దాడి చేసి పారిపోయారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి చెన్నూర్ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

దండేపల్లి: మండలంలోని మేదరిపేట వద్ద బుధవారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నాగసముద్రం గ్రామానికి చెందిన సిద్దార్థ అనే యువకుడి కుడికాలు విరిగింది. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన చోట రోడ్డుపై గుంతలు ఉండడంతో తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి..

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్ పటేల్ గ్రామంలో పిండిగిర్ని నడిపిస్తూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో విద్యుత్ సమస్య రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే గమనించిన స్థానికులు తానూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భైంసాలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం నిజామాబాద్‌కు తరలించారు. ఈ విషయమై లైన్‌మెన్ రాజన్నను వివరణ కోరగా ఎల్‌సీ తీసుకోకుండా మరమ్మతులు చేపట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు.

ప్రహరీ కూలి 15 మేకలు మృతి



మేకల కళేబరాలు

చెన్నూర్: చెన్నూర్ రజకవాడలో ప్రమాదవశాత్తు ప్రహరీ కూలిన ఘటనలో 15 మేకలు మృతి చెందాయి. కాలనీవాసులు తెలిపిన వివరాలు.. రజక కులానికి చెందిన సమ్మయ్య కుల వృత్తిని వదిలి మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. సమ్మయ్యకు 20 మేకలు ఉండగా పట్టణానికి చెందిన మరికొంత మంది మేకలను కాస్తున్నాడు. ఇందుకు ఒక పాత ఇంటి ఆవరణను అద్దెకు తీసుకున్నాడు. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు మట్టిగోడలు తడిసి ఉండడంతో బుధవారం ప్రహరీ కూలి 15 మేకలు మృతి చెందగా ఆరు మేకలకు గాయాలయ్యాయి. సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ సందర్శించి పంచనామా చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

నవోదయ దరఖాస్తులకు గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈనెల 21 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 –27 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతికి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు ఎడిట్ చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పులిదాడిలో గేదె మృతి?



గేదె కళేబరం వద్ద రైతు గోపి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అనుకోడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో రైతు బైరీ గోపికి చెందిన గేదె బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గేదె మృతికి పులి దాడే కారణమా లేదా ఇతర జంతువులు దాడి చేశాయా అన్న విషయం తెలియరాలేదు. ఈ విషయంపై అటవీశాఖ అధికారి శశిధర్‌బాబును ఫోన్‌లో సంప్రదించగా వివరాలు దాటవేశారు.

మర్లపల్లి అడవుల్లో చిరుత సంచారం



ఆవుపై దాడి చేస్తున్న చిరుత

బోథ్: మండలంలోని మర్లపల్లి శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. బుధవారం మర్లపల్లి గ్రామ సమీపంలో చిరుత ఆవుపైన దాడి చేసింది. ఆవుపై చిరుత దాడి చేసిన సీసీ ఫుటేజీ అటవీ అధికారులకు చిక్కింది. వృద్ధులు, చిన్నపిల్లలు, రైతులు అడవుల్లోకి వెళ్లకూడదని ఎఫ్ఆర్‌వో ప్రణయ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సాత్నాల క్వార్టర్స్ ఆవరణలో గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఖొక్కల్‌గూడకు చెందిన మహ్మద్ అవేజ్ వద్ద 15 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన: సెపక్ తక్రా ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించాలని సెపక్ తక్రా జిల్లా కన్వీనర్ కుమ్మరి మల్లేశ్ అన్నారు. బుధవారం మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో సెపక్ తక్రా ఉమ్మడి జిల్లా అండర్ 14, అండర్ 19 జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారు ఈనెల 10 నుంచి 12 వరకు గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు భాస్కర్, ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, జనరల్ కెప్టెన్ కిరణ్, సీనియర్ క్రీడాకారులు నరేశ్, పీడీ తిరుపతి, రాకేశ్, గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్లు..

అండర్ 14 సబ్ జూనియర్స్ జిల్లా బాలుర జట్టుకు జి. శివకుమార్, బి. కన్నయ్య, జి. శివచరణ్, సీహెచ్ హరీశ్, ఎస్.సాయిచరణ్, అదనపు క్రీడాకారుడిగా బి. అభిలాష్‌లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో టి. హాసిని, ఎస్.అక్షర, కే.దర్శిని, కే.శ్రీవల్లి, వి.అఖిల, అదనపు క్రీడాకారిణిగా బి. కౌసల్యను ఎంపిక చేశారు.

అండర్ 19 విభాగంలో..

సెపక్ తక్రా ఉమ్మడి జిల్లా అండర్ 19 బాలుర జట్టులో కే. రామ్‌చరణ్, సీహెచ్.శ్రీకాంత్, కార్తీక్, అజిత్, విక్రమ్, అదనపు క్రీడాకారుడిగా దీపక్‌లను ఎంపిక చేయగా, బాలిక జట్టులో కే. అభినయ రమ్యశ్రీ, జే.రక్షిత, ఏ.సానియా, ఆర్.సలోనీ, ఎం.యాసశ్రీ, అదనపు క్రీడాకారిణిగా ఏ. కీర్తి, సీహెచ్. రూపాలిలు చోటు దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జన్నారం: ఎంపికైన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి



బెల్లంపల్లి: స్వామిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. కాసిపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. పోటీల్లో కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి పి.స్వామి ప్రతిభ చూపి పోటీలకు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు.

నెట్‌బాల్ పోటీలకు..

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు అర్జున్, వికాస్‌లు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ బుధవారం తెలిపారు. నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11 వరకు మహబూబాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్, జూనియర్ విభాగం పోటీల్లో పాల్గొనను న్నట్లు తెలిపారు. పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

జన్నారం: జన్నారం మండలం స్లేట్ హైస్కూల్ కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. విద్యార్థులు భానుచరణ్, అరవింద్, తేజస్విన్‌లు మంచిర్యాల జిల్లా నుంచి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. డైరెక్టర్ రజితరెడ్డి అభినందించారు.

'నిందితుల ఆచూకీ తెలపండి'

మంచిర్యాలక్రైం: ములుగు జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ కాలనీలో 2014, ఫిబ్రవరి 21న జరిగిన దొంగతనం కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుల ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ములుగు సీఐ దారం సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చింతపండువాడలో నివాసం ఉన్న తమిళనాడుకు చెందిన రాజమనికాంత్ ప్రకాశ్, మణిమాల, విజయశెట్టిలు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన తూల శ్రీనివాస్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 4.75 తులాల బంగారు నగలు, రూ.1.15లక్షల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. దొంగతనం కేసు కోర్టులో విచారణలో ఉండగా నిందితుల్లో ఇద్దరు మణిమాల, విజయశెట్టిలు కోర్టుకు హాజరు కాకపోవడంతో ములుగు జేఎఫ్‌సీఎం కోర్టు ఆరు నెలల క్రితం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితులు 2026, జనవరి 20న లేదా అంతకంటే ముందు తేదీలలో ఉదయం 10.30 గంటలకు ములుగు కోర్టులో హాజరు కావాలని సీఐ తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ములుగు పోలీస్ 8712670082 నంబర్‌కు గాని కోర్టుకు గాని సమాచారం అందించాలన్నారు.

13 మంది రౌడీషీటర్ల బైండోవర్

ఆదిలాబాటౌన్: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 మంది పాత నేరస్తులు, రౌడీ షీటర్లను బుధవారం బైండోవర్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వీరిని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సతీశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. పాత నేరస్తులు అల్లర్లకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు.